క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి


విద్యాసామగ్రిని అందజేస్తున్న సైల్ కంపెనీ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు : ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి సైల్(సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా) కంపెనీ తరఫున సహకారాన్ని అందిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధి సింధిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సైల్ కంపెనీ వారు గ్రంథాలయ పుస్తకాలు, టీఎల్‌ఎం మెటీరియల్స్, సైన్స్, గణిత సబ్జెక్ట్‌లకు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ కంపెనీ అనేక ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, ఉపాధ్యాయులు షేక్.అహ్మద్‌బాషా, విద్యుల్లత, కృష్ణవేణి, కంపెనీ ప్రతినిధి శివకుమార్, సీఎస్సార్ సిబ్బంది భాస్కర్, పవన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందజేస్తున్న వలంటీర్లు

పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–1 పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. ఇటీవల సచివాలయ పరిధిలో వెరిఫికేషన్ నిర్వహించారు. అందులో 850 మందికి 11 రకాల వివిధ సర్టిఫికెట్లు అవసరమని గుర్తించి మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో అందజేశారు. అక్కడ తీసుకోలేని వారికి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు ఎస్కే అంజాద్, వలంటీర్లు షరీనా, సుహాసిని, ప్రవీణ్, షబనా, వెంకటరమణ, ప్రయణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేమిరెడ్డి వనజమ్మకు ప్రముఖుల నివాళి

కొడవలూరు: టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డిల తల్లి వేమిరెడ్డి వనజమ్మ ఉత్తరక్రియలు కొడవలూరు మండలం గండవరంలో బుధవారం నిర్వహించగా, ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, పరసా వెంకటరత్నం, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పారిశ్రామికవేత్త గంగాధర్, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఉన్నారు.

సెక్యూరిటీ గార్డుకు కత్తిపోట్లు


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కృష్ణ

పొదలకూరు : పట్టణానికి సమీపంలో లింగంపల్లితోపు వద్ద బ్రాందీషాపు సెక్యూరిటీ గార్డు బుధవారం రాత్రి కత్తిపోట్లకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఊరిబయట బ్రాందీషాపులకు ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉంటారు. వారిలో పొదలకూరుకు చెందిన కృష్ణ డ్యూటీలో ఉండగా షాపునకు దగ్గరలో ఉన్న వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన అబ్బు అనే యువకుడు షాపు వేళలు పూర్తయిన తర్వాత మద్యం కావాలని వెళ్లాడు. ఈ సమయంలో మద్యం ఇవ్వరని గార్డు చెప్పడంతో అబ్బు తన వద్ద ఉన్న చాకుతో గార్డు పొట్టపై పొడిచి పరారయ్యాడు. బాధితుడ్ని పొదలకూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ మేరకు ఎస్సై కరిముల్లా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కేన్సర్ ఆస్పత్రిలో వైద్యపరికరాల ప్రారంభం

నెల్లూరు(బారకాసు): పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో నూతన రేడియేషన్ వార్డు, ఐసీయూ విభాగాలతో పాటు రేడియేషన్‌కు సంబంధించిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన లైనియర్‌ఆక్సిలరేటర్ మెషిన్, సీటీస్కాన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీఎస్ జిల్లాశాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ దాతృత్వంతో దాదాపు రూ.కోటితో నిర్మించిన 150 కేవీఏ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ సిస్టమ్‌ను ప్రారంభించనున్నట్లు వివరించారు.

లాభాల బాటలో వేరుశనగ

- చాలా కాలం తర్వాత సాగు చేస్తున్న వైనం
- ప్రభుత్వ చేయూతతో పంటల మార్పిడి

పొదలకూరు : వేరుశనగ సాగు లాభాల బాటలో ఉంది. పొదలకూరు ప్రాంతంలో రైతులు పంటల మార్పిడి చేసి వేరుశనగ సాగుకు అలవాటు పడుతున్నారు. మరో నెలన్నరలో పంట చేతికి అందే అవకాశం ఉంది. మండలంలోని నల్లపాళెం, దుగ్గుంట, తోడేరు, భోగసముద్రం తదితర ప్రాంతాల్లో రైతులు రెండేళ్ల క్రితం తొలిసారిగా వేరుశనగ సాగుకు సమాయత్తం అయ్యారు. దశాబ్దాల కిందట ఎప్పుడో ఈ ప్రాంతంలో వేరుశనగ పంట సాగు చేపట్టారు. తర్వాత ఈ ఏడాది సూరాయపాళెం, ఇనుకుర్తి, కొనగలూరు, విరువూరు గ్రామాల్లో రైతులు పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం చేయూతతో ఇప్పుడు పంటల మార్పిడి చేసి శనగ సాగు చేపడుతున్నామని రైతులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన విత్తనాలను వ్యవసాయశాఖ ఉచితంగా అందజేస్తున్నందున రైతులు ముందుకు వస్తున్నారు. అయితే కొందరు రైతులు సొంతంగా విత్తనాలను తెచ్చుకుని సాగు చేస్తున్నారు. సూరాయపాళెం గ్రామాల్లో 100 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇసుక నేలల్లో వేరుశనగ దిగుబడి బాగుంటుందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంత రైతులు నిమ్మ, వరి, మినుము, పెసర, పచ్చిశనగ సాగు తప్పించి ఇతర పంటలపై దృష్టి సారించింది లేదు.

దిగుబడి వస్తే లాభాలే

వేరుశనగ పంట రైతులు ఆశించిన విధంగా దిగుబడి వస్తే లాభాలు బాగా వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి అయ్యే ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం క్వింటా వేరుశనగ రూ.10 వేల వరకు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.1.50 లక్ష పైగా ఫలసాయం వస్తుందని, ఇందులో ఖర్చులు రూ.60 నుంచి రూ.70 వేలు పోను ఎకరాకు రూ.80 వేలు ఆదాయం ఉంటుంది. తొలిసారిగా సాగు చేస్తున్న వేరుశనగలో రైతులు లాభాలు గడిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు వెల్లడించారు. మూసపద్ధతిలో ఒకే పంటల సాగును రైతులు చేపడుతుండడం వల్ల నష్టాలు చవిచూస్తున్నారు. పంటల మార్పిడి పద్ధతిని పాటిస్తే లాభాలు గడించే అవకాశం ఉంటుంది. అల్పపీడనం వల్ల కురిసిన వర్షాల వల్ల ప్రస్తుతం వేరుశనగకు ఇబ్బంది లేదని, భారీ వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు.


మండలంలో సాగవుతున్న వేరుశనగ పంట

లాభదాయకం



చాలా కాలంగా వేరుశనగను స్వల్పంగా చేస్తున్నాం. వాతావరణం అనుకూలిస్తే వేరుశనగ సాగు లాభదాయకంగా ఉంటుంది. పంటల మార్పిడితో సాగు చేయాలనే ఆలోచనతో వేరుశనగ సాగు చేపట్టాను. సాగులో నాకు అనుభవం ఉంది, వర్షం వల్ల ఇబ్బందులేమి లేవు.

– కేతు రామిరెడ్డి, రైతు, కొనగలూరు

రైతులకు సూచనలు చేస్తున్నాం



పంటల మార్పిడి చేసుకుని సాగు చేసుకోవాల్సిందిగా రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నాం. మండలంలో రైతుల ఆలోచనల్లో మార్పులు వస్తున్నాయి. ఫలితంగానే వేరుశనగ సాగు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో లాభాలు ఉంటాయని భావిస్తున్నాం.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి


బాధితులకు ఎమ్మెల్యే ప్రసన్న చేసిన ఆర్థిక సాయం ఫొటోలను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- జనసేన నేతలకు వైఎస్సార్‌సీపీ నేతల హితవు

బుచ్చిరెడ్డిపాళెం : జనసేన నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు హితవు పలికారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలు ఎస్సీ కాలనీలో పలువురికి డయేరియా సోకిన 13 రోజుల తరువాత వచ్చిన జనసేన నేత కిశోర్ నిజాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి మాట్లాడటం తగదన్నారు. గ్రామంలో గత 15 రోజులుగా డయేరియా సోకి దాదాపు నలుగురు చనిపోయారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్న తొలిరోజు నుంచే వైద్యశాఖ, రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ నివారణ చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా ఈనెల 18న ఎమ్మెల్యే ప్రసన్న కాలనీలో పర్యటించి బాధితులను పరామర్శించారని, మృతిచెందిన వారి రెండు కుటుంబాలకు రూ.50 వేల చొప్పున, డయేరియా నుంచి కోలుకున్న మరో ఇద్దరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందజేశారన్నారు. ఇప్పుడు జనసేన నేతలు వచ్చి రాజకీయం చేయడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నేతలు సీతారామిరెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, మోర్ల మురళీ, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆదిశేషయ్య, కిరణ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

- జాబ్‌మేళాలో 328 మందికి ఉద్యోగాలు

కోవూరు : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుంటారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడం ద్వారా యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ నిర్వహించిన జాబ్‌మేళాలో 14 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై ఉద్యోగాల ఎంపిక చేపట్టారన్నారు. మొత్తం 673 మంది నిరుద్యోగులు హాజరవ్వగా 328 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఇప్పటికే సచివాలయాల ద్వారా సీఎం వైఎస్ జగన్ లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారని, ఇలా జాబ్‌మేళాల ద్వారా మరింత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. జాబ్‌మేళాకు సహకరించిన అధికారులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీఓ సాయి వినీల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, బొంథిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, మండల ఏఏబీ చైర్మన్ హరి ప్రసాద్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, సర్పంచ్ లక్ష్మీకుమారి, ఎంపీటీసీ వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సభ్యుడు అనూప్‌రెడ్డి, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

గంగమ్మకు పూలంగిసేవ



నెల్లూరు సిటీ: పడారుపల్లిలోని గంగమ్మ దేవస్థానంలో మండలం పూజల సందర్భంగా బుధవారం గంగమ్మకు మల్లెపూలతో విశేషాలంకరణ చేశారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గంగమ్మసేవకులు శ్రీహరి, శివయ్య, సుబ్బారావు, శేషయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో ముప్పే

- సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరిక


మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : చెడు అలవాట్ల వల్ల విలువైన భవిష్యత్తుకు ముప్పు ఏర్పడుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ అన్నారు. ముత్తుకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, 'గుడ్ టచ్–బ్యాడ్ టచ్'లపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వీటికి అలవాటు పడితే అనేక అనర్థాలు జరుగుతాయని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే విలువైన జీవితం అంధకారం అవుతుందని అన్నారు. వీటికి బానిస కాకుండా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ సందర్భంగా వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ సుజాత, మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘన నివాళి

పొదలకూరు : మండలంలోని నావూరుపల్లి వైఎస్సార్‌సీపీ నేత చొప్పా రమేష్ తండ్రికి వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘన నివాళులర్పించారు. ఇటీవల రమేష్‌కు పితృవియోగం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు కె.రామిరెడ్డి, నేతలు వాకాటి శ్రీనివాసులురెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి, డి.వి జయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


పెయ్యలపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

కొడవలూరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య సూచించారు. మండలంలోని పెయ్యలపాళెంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారా.. లేదా? అని పరిశీలించారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు సకాలంలో అందిస్తున్నారా.. లేదా? అని ఆరా తీశారు. రక్తహీనతను గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఓపీ ద్వారా పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారికి మందులు అందిస్తుండడం, క్షయ, కుష్ఠు రోగుల ఇళ్లకు సైతం వెళ్లి వైద్య సలహాలిస్తుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందుతున్నట్లు వెల్లడించారు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో విధిగా కార్యక్రమాన్ని అమలు చేసేలా ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ప్రణాళిక రూపొందించుకొని నెలలో అన్ని గ్రామాల్లో వైద్య సేవలందేలా చూసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట వైద్యాధికారిని గీతాసాహితి, సొసైటీ అధ్యక్షుడు పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్కే.రేష్మా, హెచ్‌ఏలు సీహెచ్.సుధాకర్, వి.రాధిక, ఆశా కార్యకర్త మల్లీశ్వరి ఉన్నారు.

ఆర్థిక కార్యకలాపాలపై పారదర్శకత అవసరం


కొడవలూరు : శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న ఏపీఎం రుక్మిణి


పొదలకూరు : మాట్లాడుతున్న ఏసీ వెంకటేశ్వర్లు

- వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రుక్మిణి

కొడవలూరు: పొదుపు సంఘాల ఆర్థిక కార్యకలాపాలపై పారదర్శకత అవసరమని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘబంధం వీఓఏలు, సంఘ మిత్ర కార్యవర్గ సభ్యులకు ఆర్థిక కార్యకలాపాల నిర్వహణపై మూడ్రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలు మూడు నెలలకు ఒకసారి అంతర్గత, ఏడాది ఓసారి బహిర్గత ఆడిట్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పుస్తక నిర్వహణ ప్రధానమైనందున అందులో లోపాలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంఘాల అధ్యక్ష, కార్యదర్శులపైనే ఉందన్నారు. ప్రతి సంఘం రుణ పరపతిని విధిగా పెంచుకోవాలన్నారు. ప్రతి సభ్యురాలు రూ.1.50 లక్షల రుణం పొంది సకాలంలో చెల్లించుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు గానూ ప్రతి సభ్యురాలు విధిగా నెలసరి రూ.400 లు నుంచి రూ.500లు పొదుపు చేసుకోవాలన్నారు. సభ్యులు పొందిన రుణాన్ని స్వయం ఉపాధికి ఉపయోగించుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలని చెప్పారు. ఇందుకు డీఆర్‌డీఏ అధికారుల సూచనలు, సలహాల మేరకు స్వయం ఉపాధిని నెలకొల్పుకోవాలని తెలిపారు. శిక్షణలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని విషయాలను సమగ్రంగా వివరించినందున వాటిని తప్పకుండా అమలు చేయడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ మిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, సుశీల, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శ్రీదేవి, శోభ, సుకన్య పాల్గొన్నారు.

ప్రతినెలా సమావేశాలు తప్పనిసరి

పొదలకూరు : గ్రామ పొదుపు సంఘాలు ప్రతినెలా రెండు పర్యాయాలు తప్పనిసరిగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆత్మకూరు ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు మండల సమాఖ్యలకు ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, ఇంప్లిమెంటేషన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ముగింపు శిబిరంలో ఏసీ మాట్లాడుతూ రిజిస్టర్లు ప్రతినెలా పూర్తి చేసి తీర్మానాలు చేసుకోవాల్సిందిగా సూచించారు. సంఘ సభ్యులు తీసుకున్న బ్యాంకు రుణాలతో జీవనోపాధి పొందుతూ రుణాలు తిరిగి చెల్లించాల్సిందిగా సూచించారు. పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకే రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. శిక్షణా శిబిరంలో రుణ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, అకౌంటింగ్ విధానం, అంతర్గత నియంత్రణ, ఆడిటింగ్, బ్యాంకు రుణాలు, జీవనోపాధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రోజ్‌మేరీ, సీసీ, వీఓఏలు, ఎంఎస్ ఓబీలు పాల్గొన్నారు.

కోవూరుపై జనసేన కన్ను

- చతికిలపడుతున్న టీడీపీ
- తలోదారి వెతుక్కుంటున్న తమ్ముళ్లు



కోవూరు: కోవూరు నియోజకవర్గంపై జనసేన కన్ను పడింది. ఇప్పటికే నెల్లూరు సిటీని పొంగూరు నారాయణకు, రూరల్‌ను కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో కోవూరును టీడీపీ వదులుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో టీడీపీ నేతలకు ఏమి చేయాలో తెలియక తలోదారి వెతుక్కుంటున్నారు.

తగ్గిన టీడీపీ ప్రచారం

కోవూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులు ఇప్పటికే బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో టీడీపీ కన్నా జనసేన పార్టీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన చిరంజీవి రాష్ట్రంలోనే తొలి అభ్యర్థిగా తుపాకుల మునెమ్మను కోవూరు నియోజకవర్గానికి ప్రకటించారు. ఆయన బాటలోనే తమ్ముడు పవన్ కూడా వచ్చే ఎన్నికలకు తొలి అభ్యర్థిని కోవూరు నియోజకవర్గానికి ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతుండడం గమనార్హం.

వర్గపోరుతో డీలా..

కోవూరు నియోజకవర్గంలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకు దిగజారిపోతోంది. పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయుడు దినేష్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. అయితే ఆయనకు వర్గ రాజకీయాలు తలనొప్పిగా మారాయి. తొలి నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలంరెడ్డికి టికెట్ ఇచ్చినా ఆ రెండు వర్గాలు కలిసి పనిచేసే అవకాశం లేదు. ఈ క్రమంలో కోవూరు స్థానాన్ని జనసేనకు వదిలిస్తే బాగుంటుందనే ఆలోచన టీడీపీ అధిష్టానం చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చెబుతున్నాయి. ఈ క్రమంలో జనసేన టీడీపీ నేతలతో మంతనాలు జరపడం విశేషం.

వైఎస్సార్‌సీపీ వైపే అన్నివర్గాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. ప్రతినెలా పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సొంత బిడ్డలా ఆదరిస్తున్నారు. దీంతో పాటు గ్రామాల్లో రోడ్లు, సైడు కాలువలు వేయించడం, పాఠశాలలను అభివృద్ధి చేయడం, సచివాలయ వ్యవస్థతో గ్రామస్థాయిలో పాలన రావడం, వలంటీర్ల ద్వారా పథకాలు ఇంటి వద్దకే చేరడం వంటి వాటితో ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి సానుకూలత ఉంది. ఇప్పటికే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సుమారు 90 వేల ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సందర్శించారు. ఎమ్మెల్యే ప్రసన్న తన పర్యటనలో భాగంగా పేద పిల్లలకు ఆర్థిక సాయం అందజేయడం, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించడం, అనారోగ్యంతో ఉండే పేదలకు వైద్య ఖర్చులకు నగదు వితరణ వంటివి చేస్తుంటారు. దీని వల్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తిరుగులేని స్థానంలో ఉంది.

చేపల వేటకు విరామం


తీరంలో ఉన్న పడవలు

ముత్తుకూరు : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో చేపల వేటకు ప్రతికూల వాతావరణం ఏర్పడింది. దీనితో మూడు రోజులుగా మత్స్యకారులు సముద్రంలో వేటకు విరామం ప్రకటించారు. సముద్రం కసురుగా ఉండడంతో వేట మానేసి, పడవలు, వలలను తీరంలో కట్టేశారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో 1,728 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క ముత్తుకూరు మండలంలోనే నేలటూరు, కృష్ణపట్నం, ఈపూరు పంచాయతీల్లో మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బుధవారం కూడా ముసురుపట్టి, వర్షం కురవడం వల్ల మత్స్యకారులు ఇళ్లకే పరిమితయ్యారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు


అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఉన్న సీహెచ్‌సీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీడీఓ డాక్టర్ పద్మజ అన్నారు. ఈ మేరకు సీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ముఖ్యమైన వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, అభివృద్ధి కమిటీ సభ్యులు చెర్లో సతీష్‌రెడ్డి, ప్రమీలమ్మ పాల్గొన్నారు.